'వార్త'కు స్పందన

## ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

### స్కావెంజర్ తప్పిదం వల్లే విద్యార్థులు రోడ్డుపైకి

**మునిపల్లి, నవంబరు 10 (ప్రభాతవార్త):** 'వార్త'లో విద్యార్థులతో 'వెట్టిచాకిరి చేయిస్తున్న ఉపాధ్యాయులు' శీర్షికన ప్రచురితమైన వార్తకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. విచారణ చేపట్టాలని జిల్లా విధ్యాధికారి వెంకటేశ్వర్లుని ఆదేశించారు. ఆయన కంకోల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వనిత, సంతోషమ్మ, వివేకానంద మాట్లాడుతూ స్కావెంజర్ యాదయ్యకు టీకోసం పంపంచామన్నారు. విద్యార్థులు మహేష్, కార్తింకేయలు టీ తీసుకురావడానికి బయటికి వెళ్లిన విషయం తెలియదన్నారు. ఈ విషయంపై యాదయ్యను ప్రశ్నించగా తనకు ఆరోగ్యం బాగాలేనందన బయటకు వెళ్లలేకపాయానని, విద్యార్థులు మహేష్,కార్తికేయలకు టీకోసం పంపంచానన్నాడు. జ్వరంతో బాధపడుతున్నందనే బయటకు వెళ్లలేక పోయానని చెప్పాడు. తన తప్పిదం వల్లనే ఈ పొరపాటు జరిగిందన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

'వార్త'కు స్పందన

## నేలకొరిగిన విద్యుత్‌స్తంభాన్ని సరిచేసిన అధికారులు

**కంగ్టి, నవంబరు 10 (ప్రభాతవార్త):** కంగ్టి మండలం దెగులవాడి శివారులో గత రెండు నెలల నుంచి నేలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని అధికారులు స్పందించి సోమవారం సరి చేశారు. ఈ సమస్యపై సోమవారం వార్త దినపత్రికలో 'రెండు నెలలుగా కావస్తున్నా.. ఏంటి నిర్లక్ష్యం' అని శీర్షికతో వచ్చిన కథనానికి సంబంధిత విద్యుత్ లైన్‌మెన్ రాజు స్పందించి, తమ అధికారుల సూచనలతో స్తంభాన్ని సరిచేసి వ్యవసాయ రైతులకు విద్యుత్ సరఫరా అందించారు. రైతులు వార్త దినపత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న అధికారులు



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి అందజేసిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషిచేయాలన్నారు. ప్రజావాణిలో 200 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, వివిధశాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 10,ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజ రాణితో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు సమర్పించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖాధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మొత్తం 31 దరఖాస్తులు వచ్చాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపించినట్లు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి, పిడి, డిఆర్‌డిఓ జ్యోతి, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ టౌన్ నవంబరు 10,ప్రభాతవార్త:** ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని మెదక్‌జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కార నిమిత్తం పంపించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 75 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అందులో భూభారతి 34, పెన్షన్ 14, ఇందిరమ్మ ఇండ్లు 5, ఇతర 26 దరఖాస్తులు వచ్చాయన్నారు. సమస్యలను విని వెంటనే పరిష్కారం చూపించడం లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, డిఆర్ఓ భుజంగరావు,అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ మృతి సాహితీ లోకానికి తీరనిలోటు

**గజ్వేల్ టౌన్, నవంబరు 10 (ప్రభాతవార్త):** అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరనిలోటు అని గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, భక్తిరత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అన్నారు. సోమవారం అందెశ్రీ చిత్రాన్ని సబ్బుబిళ్ళపై చిత్రించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటలో జన్మించిన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య కాగా అందెశ్రీగా కలం పేరుగా మార్చుకొని మాయమైపోతున్నడన్నా మనిషన్నవాడు అంటూ నేటి సమాజంలో అదృశ్యమౌతున్న మానవత్వపు దుస్థితిని కళ్ళకు కట్టినట్లు తన గేయ రచన ద్వారా వినిపించారని తెలిపారు. తెలుగు సాహితీ లోకాన్ని అనాథను చేసి తిరిగిరాని లోకానికి తరలివెళ్ళిన అందెశ్రీకి అశ్రునివాళులర్పించారు.



సబ్బుబిళ్లపై అందెశ్రీ చిత్రాన్ని చిత్రించిన రామరాజు

# సిద్దిపేట మెడికల్ కాలేజీలో పెరిగిన పిజి సీట్లు

* 83కు చేరిన సీట్లు * కొత్తగా రేడియాలజీ, ఆర్థోపెడిక్ విభాగాల్లో 8 పీజీ సీట్లు మంజూరు * మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు హర్షం

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు అదనంగా మరో 8 పీజీ సీట్లు మంజూరైనట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేటలో మెడికల్ కళాశాల మంజూరు చేసుకున్నామని, తొలినాళ్లలోనే వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యను ప్రారంభం చేసుకున్నామని, మొదట్లో 13 సీట్లతో పీజీ విద్య ప్రారంభం చేసుకోగా అన్ని స్పెషల్ కోర్స్‌లు ఏర్పాటు చేయాలనీ ఉద్దేశంతో సంవత్సరానికి కొన్ని కోర్స్ తెచ్చుకుంటున్నామని చెప్పారు. అయితే కొత్తగా రేడియాలజీలో 4 సీట్లు, ఆర్థోపెడిక్‌లో 4సీట్లు మంజూరయ్యాయని, ఇప్పటికే 75 పీజీ సీట్లు ఉండగా ఈ 8 సీట్లతో 83కు పెరిగాయని తెలిపారు. దీంతో 18 స్పెషాలిటిలలో పీజీ కోర్స్‌లు ఉన్నాయని, ఇది రాష్ట్రంలోని ఉస్మానియా, గాంధీ, వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల తరువాత సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలోనే అత్యధిక పీజీ కోర్స్‌లు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో వైద్య విద్య పూర్తి చేసి ఇక్కడే పీజీ కోర్స్ పూర్తి చేయాలనే లక్ష్యంతో సిద్దిపేట వైద్య కళాశాల మరింత ముందుకు పోతుందని అన్ని వసతులతో, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు





సిద్దిపేట మెడికల్ కళాశాల దృశ్యం

లేకుండా కళాశాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎంబిబిఎస్ పూర్తిచేసిన విద్యార్థుల ఈ విద్యా సంవత్సరం నుండి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఉస్మానియా, గాంధీస్థాయికి సిద్దిపేట వైద్యకాలేజీ ఫలిస్తున్న హరీష్‌రావు ప్రయత్నం

సిద్దిపేట వైద్య కళాశాల ఏర్పాటైన అనతి కాలంలోనే 18 స్పెషాలిటి పీజీ కోర్సులు ఏర్పాటు కావడం ఉస్మానియా, గాంధీ, కాకతీయ వైద్య కళాశాల స్థాయిలో సిద్దిపేట కళాశాల చేరింది. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు ముందు చూపు ఆలోచన ఫలిస్తుంది. కళాశాల ప్రారంభం నుండే హరీష్‌రావు మంత్రిగా ఉండి పీజీ కోర్స్ తీసుకొచ్చారు. సిద్దిపేటలో మెడిసిన్ చదివిన విద్యార్థి, సిద్దిపేటలోనే పీజీ చేయాలి, అదేవిధంగా పేద విద్యార్థులకు పూర్తిస్థాయి వైద్య విద్య అందాలని హరీష్‌రావు ముందు చూపుతో పీజీ కోర్స్‌లు సీట్లు తీసుకొచ్చారు. దానికి అనుగుణంగా కొత్తగా 8 సీట్లు మంజూరుతో రెండు కోర్స్‌లు రావడంతో 18 స్పెషాలిటి పీజీ కోర్స్‌లు పెరిగి రాష్ట్రస్థాయి ప్రభుత్వ వైద్య కళాశాల స్థాయిలో సిద్దిపేట వైద్య కళాశాలకు దక్కింది.



ప్రజావాణిలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

## ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ

**మెదక్ టౌన్, నవంబరు 10, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను తెలియజేశారు. మొత్తం 11 ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. కొన్నింటిపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలి. చట్టబద్ధ మార్గంలోనే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ప్రజల భద్రత, శాంతి, వారితో మరింత దగ్గరగా ఉండటం ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వేగవంతంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు.

## నాచగిరిలో కార్తీకమాస విశేష పూజలు

**వర్గల్, నవంబరు 10 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో కార్తీకమాస విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలోని ఉప ఆలయమైన శివాలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు శివున్ని దర్శించుకోవడంతోపాటు శ్రీలక్ష్మీనృసింహ్మస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే స్వామివారి నిత్య కళ్యాణాలు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, అభిషేకాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సాయంత్రం ఆలయంలో ఆకాశ దీపారాధన మరియు నదీహారతి కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. దేవస్థానం తరపున సుహాసినులకు తాంబూలం (పసుపు, కుంకుమ, గాజులు, బొట్టు, పండు, కనుమలు) ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్త, కార్యనిర్వహణాధికారి విజయరామారావు, ధర్మకర్తలు ఉషాశ్రీ రాజశేఖరశర్మ, కొత్తపల్లి శ్రీనివాస్‌లు అందించడం జరిగింది. అలాగే హైద్రాబాద్‌కు చెందిన వెంకటేశ్వర డాన్స్ అకాడమీ బృందంచే నిర్వహించిన భరతనాట్యం అందరిని ఆకట్టుకుంది.



నాచగిరి క్షేత్రంలో నదీ హారతి ఇస్తున్న వేదపండితులు





తైక్వాండో పోటీలలో మెడల్స్ సాధించిన క్రీడాకారులు

## జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు సిద్దిపేట విద్యార్థి

**సిద్దిపేట రూరల్, నవంబరు 10, ప్రభాతవార్త :**

హైదారాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన 8వ ఇంటర్ డిస్ట్రిక్ క్యాడెట్ తైక్వాండో ఛాంపియన్షిప్ 2025లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 4 మెడల్స్ సాధించినట్లు జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ 37 కిలోల విభాగంలో ఈ.నిశాంత్ గోల్డ్‌మెడల్ సాధించగా అండర్ 29 కిలోల విభాగంలో బి.విజ్ఞశ్రీ సిల్వర్ మెడల్ సాధించిటనట్లు తెలిపారు. అండర్ 45 కిలోల విభాగంలో ఎం. విజయశ్రీ నరసింహ, అండర్ 54 కిలోల విభాగంలో పృథ్వీరాజ్ చౌహన్ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులకు తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ఒలంపిక్ కోశాధికారి, తెలంగాణ తైక్వాండో అధ్యక్షులు సతీష్‌గౌడ్, తెలంగాణ తైక్వాండో కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్స్‌ను అందజేశారు. గోల్డ్‌మెడల్ సాధించిన ఈ.నిశాంత్ ఈనెల 21 నుంచి 23 వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరిగే 8వ జాతీయస్థాయి క్యాడెట్ తైక్వాండో పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైనా నిశాంత్‌ను, మెడల్స్ సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో గౌరవాధ్యక్షులు వేలేటీ రాధాకృష్ణశర్మ, ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట నర్సయ్యలు అభినందించినట్లు తెలిపారు.

## 108 సేవల సమస్యలపై ఆర్‌ఎంవోతో సమీక్ష

**గజ్వేల్, నవంబరు 10 (ప్రభాతవార్త):**

గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో 108 సేవల నిర్వహణపై ఆర్ఎంవో రాముతో ఈఎంఆర్ఐజిహెచ్ఎస్ 108 సిద్దిపేట జిల్లా సమన్వయకర్త ఈఎఈ హరిరామకృష్ణ సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరిరామకృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్‌కు తరచుగా రెఫర్ చేస్తున్న ఐఎఫ్‌టి కేసుల కారణంగా స్థానికంగా అంబులెన్స్ సేవలు అందు బాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు సుమారు 5 నుండి 6 ఐఎఫ్‌టి కేసులు కేవలం 108 వాహనాల ద్వారానే హైదరాబాద్‌కు తరలిస్తున్నందున అత్యవసర సమయాల్లో స్థానిక ప్రమాద బాధితులకు తక్షణ సేవలు అందించడం కష్టమవుతుందని వివరించారు. అలాగే సంబంధీకులు లేని పేషెంట్లను 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకు వచ్చినప్పుడు సంబంధీకులు వచ్చే వరకు అంబులెన్స్ సిబ్బంది అక్కడే ఉండాలని డ్యూటీ డాక్టర్లు కోరడం వల్ల సేవల సమయం పెరిగి కొత్త కేసులకు స్పందించడం కష్టమవుతుందని, ఈ అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎంవో దృష్టికి తీసు కెళ్లి నట్లు తెలిపారు. ఆర్ఎంవో సానుకూలంగా స్పందించి సమస్యల పరి ష్కారానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది కొండల్ రెడ్డి, వర్షిత, శ్రీకాంత్, 102 సిబ్బంది శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీఉమామహేశ్వరుడికి మహా జలాభిషేకోత్సవం

**కౌడిపల్లి, నవంబరు 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బతుకమ్మ తాండలోగల ఆదిలక్ష్మి ఆశ్రమంలో వెలసిన శ్రీఉమామహేశ్వరుడికి సోమవారం 108 కలశాలతో ఘనంగా మహా జలాభిషేకోత్సవం నిర్వహించారు. ఉదయం కౌడిపల్లిలోని శ్రీఅభయ రామాలయంలో 108 కలశాలకు మహిళలతో పూరోహితులు శ్రీఫణీంద్రశర్మ వేదమంత్రాలతో మహాసంకల్ప, కలశారాధన పూజలను జరిపించారు. అనంతరం శ్రీ అభయ రామాలయం నుండి బతుకమ్మ తండాలో గల ఆదిలక్ష్మి ఆశ్రమానికి మహిళలు శిరస్సుపై కలశంను ధరించి, ఓం నమఃశివాయ నామ స్మరణతో మహా పాదయాత్రగా బయలుదేరినారు. ఆశ్రమంలో గల శ్రీఉమామహేశ్వరునికి ఎంతో భక్తి శ్రద్దలతో శివ పంచాక్షరి నామజపంతో మహా జలాభిషేకం నిర్వహించారు. కాగా కౌడిపల్లి గ్రామానికి చెందిన రమాప్రతాప్‌రెడ్డి దంపతులు ఆరు సంవత్సరాల క్రితం ఛార్‌ధామ్ యాత్ర చేసిన సందర్భంతో ప్రయాగ కాశిలో అక్కడి భక్తులు సాంప్రాదాయ దుస్తువులను ధరించి శివాలయానికి కలశంలతో పాదయాత్రగా వెళ్లి శివలింగానికి జలాభిషేకం నిర్వహించిన సన్నివేశాని స్ఫూర్తిగా తీసుకోని ప్రతిఏడాది కార్తీక మాసంలో ఏదో ఒక సోమవారం 108 కలశలంతో శివుడికి అభిషేకం చేయడం అనవాయితీగాచేసుకోని పూజలు చేయడం జరుగుతుంది. కాగా ఈ ఏడాది సప్త నదీ నదుల నుండి సేకరించిన జలంతో 108 కలశంలకు అభయ రామాలయం నుండి మహిళ భక్తులతో శివ నామాస్మరణలతో పాదయాత్రగా వెళ్లి శ్రీఆదిలక్ష్మి ఆశ్రమంలోని ఉమామహేశ్వరుడికి మహా జలాభిషేకోత్సవం చేయించారు. కౌడిపల్లి నుండి బతుకమ్మ తండా వరకు నిర్వహిస్తున్న పాదయాత్రకు స్థానిక ఎస్సై మురళి సిబ్బందితో మహిళల పాదయాత్రకు ఎలాంటి విఘాతం జరగకుండా ప్రత్యేక బందోబస్తు చేయడంపట్ల పలువురు ఎస్సై మురళిని ప్రశంసించారు. కార్యక్రమంలో రమాప్రతాప్‌రెడ్డి దంపతులతో పాటు యాదవ సంఘం, కాంగ్రెస్ నాయకురాలు మాణిక్యమ్మ, రూప లింగంగౌడు, గిరిజన మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ ఉమామహేశ్వర స్వామికి 108 కలశాలతో జలాభిషేకం నిర్వహిస్తున్న మహిళలు





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

## దెబ్బతిన్న రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబరు 10, ప్రభాతవార్త :**

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్డుపనులను వెంటనే చేపట్టాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లాలో వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న ఆర్ అండ్ బి పరిధిలోని రోడ్లు, పంచాయతీరాజ్ రోడ్లు పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. టెండర్లు పూర్తయిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధులపట్ల అధికారులు నిరక్ష్యం వద్దన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల విధులు నిర్వహించాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు బిఎల్ఓలను బిఎల్ఓ సూపర్వైజర్లను సరిగా మానిటర్ చేయకపోవడం వల్ల అనుకున్న లక్ష్యాలను సకాలంలో చేరుకోవడం లేదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల పట్ల నిరక్ష్యం ఇస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇంకా కొంతమంది బిఎల్వోలు తమ ఆన్లైన్ ఆప్‌లో ఇప్పటికీ లాగిన్ కాలేదని అలాంటి సమస్యలు ఇకముందు పునరావృతం కావద్దని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో టిఎస్‌బి పాస్ కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తాసిల్దార్ల నుండి మున్సిపల్ కమిషనర్ల నుండి కలెక్టరేట్‌కు వచ్చే ఫైళ్ళలో పూర్తి సమాచారంతో పంపాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజరాణి, సంబంధిత జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్మీకి ఆర్థిక సహాయం చేద్దాం

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ టౌన్, నవంబరు 10,ప్రభాతవార్త:** ఆర్మీ, సహాయ సహకారాలు ఆర్థికంగా సహకరిద్దామని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో భారత స్కౌట్ అండ్ గైడ్స్ వారి వారోత్సవాల్లో భాగంగా భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ స్టిక్కర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిష్కరించిన స్టిక్కర్స్‌ను పాఠశాల స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు విక్రయించగా వచ్చే డబ్బులను ఆర్మీ, సహాయ సహకారాలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ లో శిక్షణ పొందిన వారు పాఠశాల, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో విక్రఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రాధకిషన్, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఇప్ప రాజేందర్,నాగరాజు, జ్యోష్ణ, తదితరులు పాల్గొన్నారు.





స్కౌట్ అండ్ గైడ్ వాల్ పోస్టర్ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

## ఎత్తిపోతల పథకం విద్యుత్ వైర్ చోరీ

### -పట్టించుకోని అధికారులు-పరేషాన్‌లో ప్రజలు

**మనూర్, నవంబరు 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పల్‌కుర్తి ఎత్తిపోతల పథకంకై ఏర్పాటు చేసిన 27 విద్యుత్ స్థంభాలకు అమర్చిన విద్యుత్ వైరు చోరీకి గురయింది. విద్యుత్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేసినా విద్యుత్ అధికారులకుకాని, ఎత్తిపోతల పథకం అధికారులకుగాని పట్టించుకోకపోవడంతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసినా పథకం ద్వార రైతులు పంటల సాగుకు సాగు నీటిని అందుకుంటున్న దాఖలాలు లేకుండా పోయాయి. పథకం ద్వార రైతులకు సాగునీరు సరఫరా చేసేందుకు విద్యుత్ స్థంభాలకు అమర్చిన విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. 27 స్థంభాలకు అమర్చిన విలువైన విద్యుత్ వైరు చోరికి గురయినా ఎత్తిపోతల పథకం అధికారులకుగాని, పథకం కాంట్రాక్టర్ గాని తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తూ పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకంతో రైతులు ప్రయోజనం అందుకునేలా కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**జహీరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** మల్‌చెల్మ తండాలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 6 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ యం కాశీనాథ్ పేర్కొన్నారు. జూదరుల నుంచి 10450 రూపాయలను, 5 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సుమోటోగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కాశీనాథ్ వివరించారు.

**జహీరాబాద్‌లో ఆరుగురు...**

**జహీరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** పట్టణలోని హౌజింగ్ బోర్డు కాలనీలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి జూదగృహంపై దాడి చేసి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కే వినయ్‌కుమార్ పేర్కొన్నారు. జూద గృహంలో పేకాట ఆడుతున్న 6 గురిని అరెస్టు చేసి 8550 రూపాయలను, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

### పట్టణంలో యువకుడి అదృశ్యం

**జహీరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** పట్టణంలోని వసుంధర నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మైనెల్లి భవాని భర్త మైనెల్లి సోమనాథ్ అలియాస్ పవన్ (26) ఈ నెల 8వ తేదీ ఉదయం వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదని ఎస్ఐ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్ఐ వినియ్ కుమార్ కథనం ప్రకారం....పట్టణ శివారులోని మహేంద్ర కర్మాగారం కాంట్రాక్టుగా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడన్నారు. రాత్రికి ఎంతకూ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, సన్నిహితుల వద్ద అచూకికోసం గాలించినా ఫలితం లేకపోవడంతో అదృశ్యమైన సోమనాథ్ సతీమణి మైనెల్లి భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ వివరించారు.

## కాళీ ఆలయంలో శివలింగాలకు విశేషపూజలు

-పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



ఆలయంలో పూజలుచేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తదితరులు

**వెల్దుర్తి, నవంబరు 10, ప్రభాతవార్త:**

మండలంలోని ఎం.జలాల్పూర్ గ్రామంలో వెలసిన శ్రీమహాకాళికామాత ఆలయంలో కార్తీక బహుళపంచమి మహా పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం పుట్టమట్టితో చేసిన శివలింగాలకు విశేష అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి మహారుద్రహోమం సాయంత్రం అమ్మవారికి ఉమామహేశ్వరస్వామి దీపముల అలంకరణసేవ ఎంతో విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ పాల్గొని పూజనిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి మోహన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అందుగులపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ

**వెల్దుర్తి, నవంబరు 10, ప్రభాతవార్త:**

మండలంలోని అందుగులపల్లి గ్రామంలో సోమవారం శివ పంచాయతన ఆంజనేయస్వామికి పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆంజనే యస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

## బైక్ దగ్ధంచేసిన యువకుల అరెస్ట్



బైక్ దగ్ధమైన బాధితుని పరామర్శించిన రాధామల్లేష్‌గౌడ్ తదితరులు

**వెల్దుర్తి, నవంబరు 10, ప్రభాతవార్త:**

మండలంలోని కుకునూరు గ్రామంలో ఆదివారం రాత్రి 10గంటలకు గ్రామానికి చెందిన వానపురం నరసింహకు చెందిన వాహనాన్ని ఇంటి ముందు పార్క్‌చేసిన వాహనాన్ని దగ్ధం చేసిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న సిఐ రంగ కృష్ణ విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు రాధామల్లేష్‌గౌడ్ గ్రామంచేరుకొని బాధితుని పరామర్శించారు.

## అందెశ్రీ మృతిపై ఎమ్మెల్సీ సంతాపం

**రామచంద్రాపురం, నవంబరు 10, ప్రభాతవార్త:**

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ(64) అకాలమృతి పట్ల బిజెపి పట్ట భద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి సంతాపం ప్రకటించారు. అందెశ్రీ మరణం తెలంగాణప్రజలను శోకసముద్రంలో ముంచిందన్నారు. అందెశ్రీ కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్యలోకానికి, తెలంగాణ సమాజానికి తీరనిలోటన్నారు.

## నిరుపేదలకు వరం సిఎంఆర్ఎఫ్

**చిలిపిచెడ్, నవంబరు 10, ప్రభాతవార్త:**

సిఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరమని స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రులచుట్టూ తిరిగి నష్టపోయిన బాధిత కుటుంబసభ్యులకు ప్రభుత్వం అందించే సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు కొంత బాసటగా నిలుస్తాయని ఆమె అన్నారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా చిలిప్‌చెడ్ మండలానికి చెందిన పలు గ్రామాల వారికి మంజూరైన 2,10,000 రూపాయల చెక్కులను సోమవారం లబ్దిదారుల కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు దుర్గారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జగ్గ అశోక్‌రెడ్డి, బెస్త లక్ష్మణ్, ఎంసి విఠల్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కేశంపేట, నవంబరు 10, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో వ్యకి మృతి చెందిన ఘటన కేశంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కేశంపేట సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామానికి చెందిన అబ్బి మల్లేష్ 45 సోమవారం ఉదయం తన అమ్మమ్మ గారి ఊరైన కాకునూర్ గ్రామానికి వెళ్లి వస్తానని స్ప్లెండర్ ఎపి 28 ఎటి 0312 నెంబర్ గల బైకుపై ఉదయం దాదాపు 8 గంటల ప్రాంతంలో బయలుదేరారు. కేశంపేట శివారులోని చంద్రకళ గార్డెన్ సమీపంలో బైకు అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కేశంపేట నరహరి తెలిపారు. మృతుడి బంధువులు గుర్తు తెలియని వాహనం గుద్దడం వల్లనే మల్లేష్ చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి బాబాయ్ బిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## కొడంగల్ అభివృద్ధికై తరలిరావాలి

**కొడంగల్, నవంబరు 10, ప్రభాతవార్త:**

కొడంగల్ అభివృద్ధికై తరలిరావాలని కెడిపి,జెఎసి అధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం గోడపత్రిక విడుదల చేశారు. అనంతరం కెడిపి, జె ఎసి కోకన్వీనర్‌లు గంటి సురేష్, యు.రమేష్‌బాబు, నరేందర్‌సింగ్‌ఠాకూర్ తదితరులు మాట్లాడుతూ ఇప్పుడుకాకపోతే ఇంకెప్పుడు కొడంగల్ అభివృద్ధి సాధ్యంకాదని, కొడంగల్ అభివృద్ధి కోసం కెడిపి, జేఏసీ ఆధ్వర్యంలో గత నెలరోజులనుంచి జరుగుతున్న పోరాటంలో నియోజకవర్గ ప్రజలు భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. కొడంగల్ అభివృద్ధి కోసం మెడికల్ కళాశాల, ఇంట్రిగ్రేటెడ్ గురుకులభవనాలు కొడంగల్ నియోజకవర్గ కేంద్రం లోనే నిర్మించాలని, దీనికి నియోజకవర్గ ప్రజలు గొంతులు కలపాలని, స్వచ్ఛంధంగా ప్రతిపౌరుడు ముందుకువచ్చి పోరాటంచేయాలని పిలుపు నిచ్చారు. కెడిపి, జెఎసి అధ్వర్యంలో శాంతియుతంగా నిరసనలు తెలుపుతుతన్న పలువురు జెఎసి నాయకులను అధికార పార్టీ నాయకులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాచేయడం అధికారపార్టీ నాయకు లకు తగదని, ఎవరెన్ని ఇబ్బందులకు గురిచేసినా భయపడేది లేదని పోరాటం ఆపేదిలేదని అన్నారు. ఈప్రాంతం అభివృద్ధి జరగాలంటే, అభి వృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ కెడిపి, జెఎసి పోరులో బహిరంగంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో భీమరాజు, మాసాని వెంకటయ్య, ఎస్ఎం.గౌసన్, షాకీర్, లోకేష్, చంద్రశేఖర్, బాబుమియా, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ప్రభుత్వ సలహాదారుడు సందర్శన

**మంచాల, నవంబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సోమ వారం తెలంగాణరాష్ట్ర ప్రభుత్వసలహాదారులు కె.కేశవరావు సందర్శిం చారు. ప్రస్తుతం నడుస్తున్న పనులను పర్యవేక్షించి ఇప్పటికే అక్కడ చేపట్టిన పనులను ముమ్మందు చేయాల్సినపనులను అడిగి తెలుసు కున్నారు. పనులను వేగవంతం చేయాల్సిందిగా కోరారు. విద్యార్థులతో కలివిడిగా మాట్లాడి స్కూల్లోని ఏర్పాట్లను ఎలా ఉన్నాయో అడిగి తెలుసు కున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పలుసలహాలు తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వపాఠశాలలోనే తమపిల్లలను చదివేలాచూడాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సుప్రియ, డీఈఓ సుసింధర్‌రావు, ప్రొఫెసర్ పద్మజ, మండల విద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు కరువు

-ధాన్యం కుప్పలతో కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

-వసతులు కల్పించాలని ఆర్డీవోకు వినతి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మిర్యాల చంద్రశేఖర్ తదితరులు

**నర్సాపూర్, నవంబరు 10, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ గ్రామం లో పిఎసిఎస్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కేంద్రంలో వసతులు లేక కొనుగోలు ప్రక్రియ ప్రారంభించకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరువ య్యారు. నెలరోజులు గడుస్తున్నా ఈ కేంద్రంలో మ్యాచర్ మిషన్, తూకంవేసే కాంట లేకపోవడంతో పట్టించుకునే నాథుడేలేడు. ఈక్రమంలో సోమ వారం రైతురక్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్ ఈ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో ఉన్న రైతులకు కల్పిస్తున్న వసతుల గురించి రైతులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా మిర్యాల చంద్రశేఖర్ మాట్లాడుతూ మ్యాచర్ మిషన్ తూకం కాంట లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోయింది దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. ధాన్యం మూడు రోజులుగా ఎండిపోయి 16నుండి 17వరకు వస్తుందన్నారు. కాంటా వచ్చిన నేపథ్యంలో మ్యాచర్ మిషన్ లేకుండా ఎలా తూకం వేస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ తూకం కాంటా సైతం ఈరోజే వచ్చిందని రైతులు తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి వరికొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా, ఈ కేంద్రాల కొనుగోలు ప్రక్రియ పట్ల అధికారులు ఇంతటి నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఈ కేంద్రం విషయమై రైతు రక్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల చంద్రశేఖర్ ఆర్డిఓ మహిపాల్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆవంచ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వసతుల ఏర్పాటుపై పిఎసిఎస్ అధికారులను వసతులు కల్పించాలని ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారన్నారు. ఈ సంద ర్భంగా రైతులు మాట్లాడుతూ అదేవిధంగా తూకం వేసిన ధాన్యమును వెంటనే రైస్‌మిల్లులకు తరలిం చడానికి ట్రాక్టర్లను లారీలను ఏర్పాటు చేయాలని నర్సాపూర్ పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్‌ను కోరారు. ఇందుకు స్పందించిన రాజుయాదవ్ వెంట నే ఏర్పాటుచేస్తానని రైతులకు ఎటువంటి ఇబ్బందు లు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారం భిస్తామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలన్నారు.

## కాలనీలో మురుగు రోడ్డు సమస్యలు తీవ్రం!

**కొత్తూరు, నవంబరు 10, ప్రభాతవార్త:**

కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఫాతిమాపూర్ కాలనీలో ఉన్న వివిధ సమస్యల పరిష్కారానికి సోమవారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో మురుగునీటి కాలువలు సరిగా లేక మురుగునీరు ఇళ్ల వద్ద నిల్వవడం, రోడ్లు దెబ్బతినడంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని వారు తెలిపారు. సీసీ రోడ్డు పనులు, కాలువ నిర్మాణం పూర్తిచేసి శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. మున్సిపాలిటీ తరఫున త్వరిత చర్యలు తీసుకుంటే ప్రజలకు ఎంతో ఊరట కలుగుతుంది, అని తెలిపారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో దిలీప్ రెడ్డి, లక్ష్మయ్య,సుధాకర్ రెడ్డి,శాంసన్ రెడ్డి, జోసెఫ్ రెడ్డి, మారెడ్డి, బాలశోరెడ్డి, ప్రతాప్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి,రాజు రెడ్డి, ఆరోగ్యరెడ్డి, ఇన్నారెడ్డి,రాజారెడ్డి,యార్లారెడ్డి,కిరణ్ తదితరులు ఉన్నారు.

### ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని

## ఆలయంలో ప్రత్యేక పూజలు

**కుల్కచర్ల, నవంబరు 10, ప్రభాతవార్త:**

చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి గుండెకు సంబందిన శాస్త్రచికిత్స జరుగుతుందని ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఆరోగ్యంగ ఉండాలని దిశకమిటి అడ్వైజర్ మెంబర్ మాజి సర్పంచ్ డాక్టర్ జానకిరామ్,టెలికం అడ్వైజర్ బోర్డు మెంబర్ గణపూరం వెంకటయ్య గౌడ్ సోమవారం పాంబండ రామలింగ్వేర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలనర్సయ్య, ఆలయ ఛైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి,రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోవింద్ కరుణప్ప ఔదార్యం..!

### ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి రూ.51 వేలు విరాళం

**నందిగామ, నవంబరు 10, ప్రభాతవార్త:**

తనకోసం ఆలోచించేవాడు మనిషి.. పదిమంది కోసం ఆలోచించేవాడు మహర్షి. అతన్నీ జనం జేజేలు కొట్టారు..మహాచత్రపతిని చేశారు. హైందవ సంస్కృతిని రక్షించిన జాతిరత్నం, మొఘల్ సామ్రాజ్యంపై దండెత్తిన వీరశివాజీ నేటి తరానికి ఆదర్శం. ధర్మాన్ని రక్షించాలి.. దేశాన్ని ప్రేమించాలి.. అనే అక్షర స్పూర్తితో..అంతటి మహానేత చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ట కోసం ఉప్పొంగిన దేశభక్తితో.. నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామానికి చెందిన గోవింద్ కర్ణప్ప రూ.51 వేలు విరాళం అందజేశారు.

## మహా పాదయాత్రలో అయ్యప్ప భక్తులు

**నందిగామ, నవంబరు 10, ప్రభాతవార్త:**

నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు సోమవారం మహా పాదయాత్రతో శబరిమల వెళ్లారు. శ్రీ శ్రీ గిరీష్ నాయర్ గురుస్వామి కరకమలాలచే మాలధారణ ధరించిన అయ్యప్ప భక్తులు నందిగామ అయ్యప్ప దేవాలయం నుండి పాదయాత్ర ప్రారంభించి వెళ్లారు. మార్గ మధ్యలో నర్సప్పగూడ మాజీ ఉపసర్పంచ్ రవీందర్ ముదిరాజ్ స్వాములకు భోజన సదుపాయం కల్పించారు. ఈ మహా పాదయాత్రలో నర్సప్పగూడ గ్రామానికి చెందిన సురేష్ గురు స్వామి, కావలి ప్రభాకర్ గురు స్వామి, శివ , అర్జున్, కే రవి, రవితేజ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. సాగనంపిన వారిలో బాతుక లక్ష్మయ్య యాదవ్, బి సుదర్శన్ గౌడ్, రవీందర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## రవీందర్ ముదిరాజ్ ఔదార్యం

### స్వాములకు వంట సామాగ్రి అందజేత

**నందిగామ, నవంబరు 10, ప్రభాతవార్త:**

నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామం నుండి శబరిమల పాదయాత్రగా వెళ్తున్న స్వాములకు సొంత ఖర్చులతో వంట సామాగ్రిని అందించి ఆశీర్వాదం తీసుకున్న నర్సప్పగూడ మాజీ ఉపసర్పంచ్ రవీందర్ ముదిరాజ్ ను గ్రామస్తులు అభినందించారు. పాదయాత్రగా వెళ్తున్న స్వాములకు రవీందర్ అందించిన సేవలను పలువురు కొనియాడారు.

## నాణ్యమైన విత్తనంపై రైతులకు క్షేత్ర ప్రదర్శన

### మండల వ్యవసాయ అధికారిని శిరీష

**కేశంపేట, నవంబరు 10, ప్రభాతవార్త:**

కేశంపేట మండలపరిధిని చౌలపల్లి గ్రామంలో జల్లెల శ్రీనివాసులు, సాటు భూపాల్ పొలంలో రాజేంద్రనగర్ వరి రీసెర్చ్ స్టేషన్ వారిచే ఇవ్వబడిన నాణ్యమైన ఫౌండేషన్ వరి కెన్ఎం 1638 విత్తన రకం చేనులో వ్యవసాయ శాఖ అధికారులు మరియు శాస్త్రవేత్తల వారిచే క్షేత్ర ప్రదర్శన నిర్వహిచారు. ఇందులో భాగంగా ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం వారిచే ఇవ్వబడిన నాణ్యమైన ఫౌండేషన్ వరి కెఎన్ఎం 1638 విత్తన వంగడాన్ని ప్రతి గ్రామంలో ముగ్గురు ఆదర్శ రైతులకు ఇవ్వడం జరిగిందని చెప్పారు. విత్తనాలను వాడటం వలన రైతులు అధిక దిగుబడులు పొందడమే కాకుండా తిరిగి మళ్ళీ దాన్ని తోటి రైతులకు కూడా విత్తనం కొరకు వాడుకోవచ్చని తెలిపారు. విత్తనం వేసినప్పటినుండి పంట కోత వరకు వ్యవసాయ అధికారుల సూచనల ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకాన్ని పాటించడం వలన రైతులు అధిక దిగుబడులు పొందారని రైతులు అభిప్రాయ పడ్డారని చెప్పారు.. నూతన వంగడమైనటువంటి కెఎన్ఎం 1638 నాణ్యమైన విత్తనము వాడటం వలన రైతులు స్వతహాగా విత్తనోత్పత్తి చేసుకొని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని చెప్పారు. రైతు శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు నూతన వంగడాన్ని పండించడం వలన ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట ఒరిగిపోకుండా ఉందని అలాగే గొల ఎత్తగా వచ్చి ఎక్కువ గింజలు రావడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు .సహాయ సంచాలకురాలు షాద్ నగర్ రమాదేవి వ్యవసాయ అధికారి శిరీష మాట్లాడుతూ ఈ వానకాలంలో మండలానికి ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు చొప్పున 108 వరి రీవిలీ 1638 రకం మినీకిట్లను ఇవ్వడం జరిగిందని చెప్పారు. రైతులు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాన్ని విత్తనఉత్పత్తికి వాడుకొని తోటి రైతులకు ఆదర్శంగా నిలవాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు టీవీ,క్రీడల దుస్తులు అందజేత

**దోమ.నవంబరు 10, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వారికి అవసరమయ్యే సౌకర్యాలు కల్పించడము కోసం ముందుకు వస్తున్న వ్యక్తులు,స్వచ్ఛంద సంస్థలకు విద్యార్థులు,తల్లితండ్రులు,ఉపాధ్యాయులు ఎంతో రుణపడి ఉంటారని దోమ మండల విద్యాదికారి వెంకట్ అన్నారు.సోమవారం నాడు దోమ మండల పరిదిలోని దిర్సంపల్లి ప్రభుత్వ పాఠశాలకు స్నేహ ఫామ్ పౌండేషన్‌సభ్యులు సురేశ్‌రెడ్డి ఎల్‌జి టీవీ,బడెంపల్లి తాండా ప్రభుత్వ పాఠశాలకు బడెంపల్లి తాండాకుచెందిన పాండునాయక్ (ప్లంబర్‌వర్కర్)క్రీడలదుస్తులు అందజేశారు. ఈసందర్భముగ ఎంఇఓ వెంకట్ మాట్లాడుతూ ప్రతిపాఠశాలలో దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు విద్యపరంగా అనేకవిదాలుగా సహాయ సహకా రాలు అందించడము జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే దోమమండలంలో చాలా పాఠశాలలో అనేకమంది దాతలు నోట్‌బుక్‌లు, పెన్‌లు, టీవిలు, ప్రొజెక్టర్‌లు, కుర్చీలు, యూనిఫాంలు, టైబెల్ట్‌లు అందించారని గుర్తు చేశారు. అలాగే పాఠశాలకు ఉచితంగా లక్ష రూపాయల విలువ గల టివీని వస్తువులు అందించిన స్నేహ ఫామ్ పౌండేషన్,దుస్తులు అదించిన పాండునాయక్‌ను పాఠశాల ఆవరణలో దిర్సంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు ఎంఇఓ,ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు. కార్యమ్రములో దిర్సంపల్లి పాఠశాల ప్రధానోప్యాధ్యా యులు శివకుమార్, మాజి చైర్మెన్‌లు, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నాచారం ఎస్‌విడి వైన్స్ ఎదుట వ్యక్తి మృతి

**నాచారం, నవంబరు 10, ప్రభాతవార్త:**

మద్యం సేవించిన ఓ వ్యక్తి ఎస్‌విడి వైన్ షాపు ముందు మృతిచెందిన సంఘటన నాచారంలో జరిగింది. నాచారం పోలీసుల కథనం ప్రకారం. నాచారం ఎచ్ఎంటీ ప్రాంతానికి చెందిన పుద్దిపేట అశ్వంత్‌కుమార్(43) సోమవారం మధ్నాహ్నం ఎస్.వి.డి. వైన్స్‌కు చేరుకున్నాడు. అక్కడే మద్యాన్ని సేవించి తిరిగి స్కూటీపై వెళ్తుతూ అకస్మాత్తుగా అక్కడే పడిపోయాడు. దీంతో ఆయన కిందపడటంతో తలకు తీవ్ర గాయం అయ్యింది. దీంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది పరిశీలించగా ఆయన అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు. మృతుడు గత కొన్ని రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# బాల్యవివాహాల నిర్మూలనకై అవగాహన ర్యాలీ

-ఐసిడిఎస్ ఆధ్వర్యంలో భారీర్యాలీ




బాల్యవివాహాల నిర్మూలనకు విద్యార్థినీవిద్యార్థులతో భారీర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, నవంబరు 10, ప్రభాతవార్త:** మాసాయిపేట మండలం కేంద్రంలో సోమవారం సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ ఐసిడిసిఎస్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల నుండి బాల్య వివాహాల నిర్మూలనకై విద్యార్థినీవిద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సదస్సులో మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు పాల్గొని వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఐసిడిఎస్ సిడిపిఓ స్వరూప రాథోడ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడా జరగకుండా చూడాలని, పిల్ల లకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని, వారికి సరైన పోషకాహారాలు విద్యను ఇవ్వాలని, బాల్యాన్ని రక్షించండి-విద్యను ప్రోత్సహించండి అని, అలాగే బాలలను శక్తివంతులను చేయండి అని, కార్య క్రమంలో పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఎంపిడివో విజ్ఞేశ్వర. పోలీస్ సిబ్బంది ఐసిడిఎస్ సూపర్వైజర్లు పంచాయతీ సెక్రెటరీ అంగన్‌వాడీ టీచర్లు తది తరులు పాల్గొన్నారు.

## మున్సిపాల్టీ అభివృద్ధికి 18కోట్లు మంజూరు

**శామీర్‌పేట, నవంబరు 10, ప్రభాతవార్త:**

రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, పార్టీలకు అతీతంగా రైతుల కోసం ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఇటీవలనే మూడుచింతలపల్లి మున్సిపాల్టీ అభివృద్ధి కోసం 18కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన అన్నారు. గత ఏడాది నుంచి సన్నవడ్లకు ఇంత వరకు ప్రభుత్వం నుంచి బోనస్ క్వింటాలుకు రూ.500రూపాయలు చొప్పున రైతులకు అందలేదని ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకవెళతానని ఆయన అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దెమర్రి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దెమర్రి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండ అన్ని ఏర్పాట్లు చూడాలని అధికారులకు సూచించారు. రైతుల నుంచి సకాలంలో వరిధాన్యంను కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు అందరు సహకరించాలని అభివృద్ధికి అందరు కలిసి రావాలని ఆయన కోరారు. ప్రజలకు సేవలు అందించటానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రైతాంగంకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తోటకూర వజ్రేశ్‌యాదవ్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వారితో పాటు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు డి.వెంకటేశ, శామీర్‌పేట సొసైటీ వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, డైరక్టర్‌లు ఎల్.నర్సింలుగౌడ్, బాపుసింగ్, చంద్రకళ, మాజీ సర్పంచు పి.బాలనర్సింహ్మా, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులు బండి జగన్నాథం,వి.లక్ష్మారెడ్డి,ఎన్.విష్ణుగౌడ్, జి.భస్వారెడ్డి, రాజేంద్రప్రసాద్‌గౌడ్, మహేశ్, గోపి, జె.పాండు, వెంకట్‌రెడ్డి, తుంకి వెంకటేశ్, లక్ష్మణ్, శ్రవణ్‌కుమార్‌గుప్తా,ఆకుల నాగేశ్,ఎస్.శ్రీనివాస్, జిల్లా రైతుసంఘం అధ్యక్షులు ఎం.సంజీవరెడ్డి, ఉద్దెమర్రి రైతుసంఘం సభ్యులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పి.సతీష్‌రెడ్డి,వై.రవీందర్‌రెడ్డి, నందుగౌడ్, శామీర్‌పేట సొసైటీ పలువురు డైరక్టర్లు, రైతులు,సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన

### ఆలయాల్లో భక్తుల సందడి

**కొడంగల్,నవంబరు 10, ప్రభాతవార్త:**

కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మహిళలు ఆలయాల్లో భక్తిశ్రద్దలతో కార్తీక దీపారాధన చేస్తు స్వామివారిని దర్శించుకుంటున్నారు .కార్తీకమాసం సోమవారం సందర్భంగా పట్టణంలోని శ్రీమహదేవుని ఆలయం,గాడిబాయి శివాలయం, బసవేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు దీపాలను వెలిగిస్తు దీపారాధన చేశారు.ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తు స్వామివారిని దర్శించు కున్నారు.శివలింగానికి పంచా మృతాభిషేకం రుద్రాభిషేకం,శివ అష్టోత్తర శతనామావళి, బిల్వార్చన ,ధూపం,దీపం,నైవేద్యాలను సమర్పిస్తు మంగళ హారతులు అందిస్తూ స్వామివారిని దర్శించు కున్నారు.శ్రీమహదేవుని ఆలయ అవరణలో బిల్వ వృక్షం,రావి,వైప వృక్షాలు,తులసి,ఉసిరి వృక్షాలకు దీపారాధన చేసి మొక్కలు చెల్లించుకున్నారు .మహిళలు ,చిన్నారులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మంగళహారతులు ఇచ్చి దీపారాధన చేశారు.

## కాలనీలో నీటి సమస్య దూరం

**కోట్‌పల్లి, నవంబరు 10, ప్రభాతవార్త:** తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి సహకారంతో కోట్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో దర్గాసైడ్‌లో నిత్యం నీటి సమస్య ఉండటంతో ప్రతి నెలకొక్కసారి పైపులైన్‌లో ఒంద్రు ఇరుకపోవడంతో ఇబ్బందులు ఉండటంతో కోట్‌పల్లి సీనియర్ నాయకులు తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకేళ్ళడంతో అయన వెంటనే స్పందించి రూ, 8 లక్షల ,50, వేలు రూపాయాలతో నల్లాల బావి నుండి, రెండు బోరు మోటర్స్ ఒక బోరు వేయించి నీటి సమస్య లేకుండా పూర్తి చేయడంతో కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మాజీ సర్పంచు నక్కల విజయలక్ష్మి, మాజీ మత్స్యశాఖ అధ్యక్షులు నక్కల బందయ్య, మాజీ సర్పంచు జ్ఞానేశ్వర్, మాజీ సర్పంచు శివనందం, మాజీ ఉప సర్పంచు రియాజోద్దిన్, కాంగ్రెస్ నాయకులు సానం క్రిష్ణ, చిత్రశేఖర్, సంకు బాలయ్య, బోవయ్య, మాజీవార్డు సభ్యులు చాకలి రమేష్, పీటర్, పెద్దెలి నర్సిములు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దినేష్, ఉప్పరి రమేష్, అజీమ్, కురేషి, సమియోద్దిన్, అక్రమ్, పాల్గొన్నారు,

## అపూర్వ సాంస్కృతికయజ్ఞం నవ్యనాటకసమితి సంగీత నృత్యోత్సవం

-డా. కె.వి.రమణాచారి

**నాంపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త :** ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక కళాసంస్థ నవ్యనాటక సమితి జాతీయస్థాయిలో సంగీత నృత్యోత్సవ పోటీలను హైదరాబాద్ నగరంలో 50ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ 9రోజుల నవదిన సంగీత నృత్యోత్సవాలు ఎంతో పవిత్రమైనవని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు.సోమవారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డా. కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని నవ్యనాటకసమితి 50వ అఖిల భారత సంగీత నృత్యపోటీల గోడపత్రిక (పోస్టర్)ను సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, కార్యనిర్వాహక సంఘ సహాధ్యక్షులు ఎ.రజిత్‌కుమార్, ఆచార్య ఫణీంద్ర, సభ్యులు రాజ్‌కుమార్, డా. ఎన్.విద్యారణ్యస్వామి, సమన్వకర్త నిష్టల సుధామాల తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు.

అనంతరం వివరాలను వెల్లడిస్తూ నవంబరు 15 నుండి 22వరకు 8రోజులపాటు నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో సంగీత నృత్య పోటీలు జరుగుతాయని, 23 రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగే కార్యక్రమానికి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ జాతీయస్థాయి సంగీత నృత్యపోటీలో స్వర్ణోత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

## నిజాంపేటలో దొంగల బీభత్సం

**నిజాంపేట్, నవంబరు 10, ప్రభాతవార్త:**

నిజాంపేట్‌లో దొంగలు ఇంట్లో ఎవరూలేని సమయంలో తాళాలు పగులగొట్టి బీరువాలో బంగారునగలు, నగదు దోచుకెళ్ళారు. వివరాల్లోకెళ్తే నారాయణఖేడ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం మాట్లాడుతూ, నిజాంపేట గ్రామంలో మర్రి కావేరి భర్త దత్తు సమీప మునిగేపల్లి గ్రామానికి వాళ్ల బంధువుల ఇంట్లో శుభకార్యం కోసం వెళ్ళారు. అదనుచూసిన దొంగలు రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, 50 తులాల వెండి, లక్ష రూపాయల నగదు రెండు బీరువాలను పగలగొట్టి దోచుకెళ్లినట్లు యజమాని కావేరి ఫిర్యాదుచేయగా ఇంటిని సబ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి సంగారెడ్డి నుంచి క్లూస్ టీంను రప్పించి ఫింగర్‌ప్రింట్స్ ఇతర ఆధారం సేకరించినామన్నారు. చుట్టుపక్కల సిసి ఫుటేజ్ ఆధారంగా దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తామన్నారు. బాధితురాలు కావేరి మాట్లాడుతూ ఎంతో కష్టపడి రోజు కూలీనాలీచేసి కూడబెట్టిన డబ్బులతో బంగారు నగలు చేయించుకోగా దొంగలపాలు అయిందని ఆవేదన వ్యక్తం చేసారు. దొంగలను పట్టుకొని మా ఆభరణాలు, డబ్బులు ఇప్పించాలని వారు కోరుతున్నారు.


దామరకుంటలో నిరసన తెలుపుతున్న దళితులు

## తమ భూమిని తమకు అప్పగించాలి

**-దామరకుంటలో దళితుల నిరసన**

**మర్కుక్, నవంబరు 10 (ప్రభాతవార్త):** తమ తాత ముత్తాతల కాలం నుండి ఉన్న తమ భూమిని అక్రమంగా పట్టా చేసుకుంటున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని దామరకుంట గ్రామ దళితులు డిమాండ్ చేశారు. సోమవారం దామరకుంటలోని వారి భూమి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భూమిపై తమకే హక్కులు కల్పించాలని, ఇతరులకు అక్రమంగా పట్టా చేసిన దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ గ్రామానికి చెందిన పత్తి పరమేశ్వర్, పత్తి కృష్ణలు మాజీ సర్పంచ్ పత్తి స్వప్న వెంకటేష్ అండదండలతో సర్వే నెం.686లో 9.5 గుంటల భూమిని సాదాబైనామాతో సంతకాలను ఫోర్జరీ చేసి పట్టా చేసుకున్నారని ఆరోపించారు. ఈ భూమిలో అక్రమ నిర్మాణాలు ఆపాలని, దళితులమైన మేము అడ్డుకుంటే పోలీసులతో కేసు నమోదు చేయించి బెదిరింపులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఇరువురు మధ్య భూమి తగాదా తమ దృష్టికి వచ్చిందని సర్వేయర్‌తో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## 17న మల్లుపల్లిలో అమరుల స్మారక స్థూప నిర్మాణం

**అమరవీరుల స్మారక కమిటీ జిల్లా కన్వీనర్ శివరాజు, కో కన్వీనర్ మేకల రాములు**

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

ఉమ్మడి మెదక్ జిల్లా అమరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 17న మిడిదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో అమరుల స్మారక స్థూపం నిర్మాణ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థి సంఘాలు, ఉద్యమకారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా స్మారక కమిటీ పిలుపునిచ్చింది. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కన్వీనర్ శివరాజు, కోకన్వీనర్ మేకల రాములు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై పోరాడి ప్రాణాలు అర్పించిన కామ్రేడ్ సంజీవ్, జాన్సన్, అప్సర్, కనకయ్య లాంటి అమరుల త్యాగాలను నేటి తరం ఎలిగెత్తి చాటాలి. బీడీ కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, సారా వ్యతిరేక ఉద్యమాలు, సబ్బండ వర్గాల హక్కుల కోసం వీరు చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని, ఈ అమరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి సామాజిక బాధ్యత" అని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రజల కష్టాలు, పేదరికం, దోపిడీ, అణచివేత పెరుగుతున్న నేప థ్యంలో, ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచిన వీరి త్యాగాలను స్మరించు కుంటూ స్మారక స్థూప నిర్మాణ ప్రారంభోత్సవంలో పాల్గొని నివాళులు అర్పించాలని కమిటీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ తిరుపతి రెడ్డి, షాదుల్లా, శారద, పృథ్వీరాజ్, అజయ్ కుమార్, ఎల్లం, సాయి కుమార్, యాదగిరి తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మూడో వార్డు నుంచి కౌన్సిలర్‌గా బరిలో ఉంటా

**-ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ ఎల్ల వెంకటేష్**

**గజ్వేల్, నవంబరు 10 (ప్రభాతవార్త):** తెలంగాణ ఉద్యమ సమయం నుండి బిఆర్ఎస్ పార్టీలో పనిచేస్తూ మూడవ వార్డు ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటున్నట్లు ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్, తెలంగాణ ఉద్యమ కారుడు ఎల్ల వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తనకు టికెట్ ఇస్తే మూడవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించానని, మూడవ వార్డులో బిఆర్ఎస్ పార్టీ తరపున బరిలో దిగుతానన్నారు. బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం దక్కిందని, ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మూడవ వార్డులో ప్రతి నిత్యం వార్డు ప్రజలతో మమేకమై ఉంటున్నానని, వార్డు ప్రజలు నేను కౌన్సిలర్‌గా నిలబడితే ఖచ్చితంగా గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీలో కౌన్సిలర్‌గా గెలుపు కోసం పార్టీ బిఫాం ఇచ్చి ముందుకు నడిపించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం


క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న మాజీ ఎంపిటిసి కృష్ణయాదవ్

**మర్కుక్, నవంబరు 10 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దామర కుంట గ్రామంలో రెండు రోజులుగా జరిగిన దామరకుంట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి సన్‌రైసర్ కెప్టెన్ నవీన్ టీం గెలుపొందగా రూ.10వేల నగదు, ద్వితీయ బహుమతి ఈగల్ టీం కెప్టెన్ శేఖర్‌బాబు టీం సభ్యులు గెలుపొందగా రూ.5వేల నగదు బహు మతిని మాజీ ఎంపిటిసి కృష్ణయాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాయత్రి బాల్‌నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, నాయకులు సంతోష్‌యాదవ్, కనకయ్య, మాదరి రాజు, క్రీడాకారులు సందీప్, శరత్, బాబు, సాయి, భాను పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించి వాహనాలు నడపాలి : ట్రాఫిక్ సిఐ

**గజ్వేల్ టౌన్, నవంబరు 10(ప్రభాతవార్త):** నిబంధనలు పాటించి వాహ నాలు నడపాలని ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, వాహనాల తనిఖీని నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడంవల్ల విలువైన ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్ప డుతుందన్నారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగవని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని తెలి పారు. మద్యంతాగి వాహనాలు నడిపితే జరిమానా,జైలుశిక్ష తప్పదన్నారు.

**మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలుశిక్ష, జరిమానా**

మద్యం తాగి వాహనాలు నడిపిన 9 మందికి రూ.90వేల జరిమానా విధించగా ఒకరికి 4 రోజుల, ఇద్దరికి 3 రోజుల జైలుశిక్ష, రూ.3వేల జరి మానా విధించడం జరిగిందని ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. కొన్ని రోజులుగా గజ్వేల్‌లోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలో మద్యం తాగి వాహ నాలు నడుపుతున్న వారికి బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నట్లు రిపోర్టు రావడంతో వారిని సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణజరిపి 9 మందికి రూ.90వేల జరిమానా, ఒకరికి 4 రోజులు, ఇద్దరికి మూడు రోజుల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధించడం జరిగిందన్నారు. జైలుశిక్ష విధించిన వారిలో గజ్వేల్ పట్టణానికి చెందిన వనం నర్సింలు, ప్రజ్ఞాపూర్‌కు చెందిన డానియల్, రామారంకు చెందిన హనుమంతులు ఉన్నారని తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కొండపాక, నవంబర్ 10, ప్రభాతవార్త :** మృతుడి కుటుంబానికి ఉపా ధ్యాయులు ఆర్థిక సహాయం అందించారు.మండల విద్యాధికారి కార్యాల యంలో పనిచేస్తున్న నాచారం వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం విషయం తెలుసుకున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి మృతుని కుటుంబ సభ్యులకు రూ॥ 61 వేల నగదుతోపాటు 25 కిలోల బియ్యం అందించారు.

# బిసి ఆక్రోశ సభ కరపత్రం ఆవిష్కరణ

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

42 బీసీ రిజర్వేషన్ల సాధన సమితి, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీల ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన కామారెడ్డిలో జరిగే బీసీ ఆక్రోశసభ కరపత్రాన్ని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ నాయకులు మాట్లా డుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని పార్ల మెంటులో ఆమోదించి భారత రాజ్యాంగంలో 9వ షెడ్యూల్లో చేర్చే ప్రక్రియలో నిజాయితీ లేకుండా తప్పుడు జీవోల ద్వారా బీసీ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనతో పాటు బీసీ రిజర్వేషన్ల బిల్లును భారత రాజ్యాంగం లోని తొమ్మిదవ షెడ్యూల్లో పెట్టం అని నిర్లక్ష్యంగా ప్రకటించిన కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరికి నిరసన గా, ఈ రెండు పార్టీల మాయా క్రీడలను చూస్తూ మౌనంగా ఉండి బీసీలను నిర్లక్ష్యం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నవంబర్ 15వ తేదీన కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండున్నర కోట్ల మంది బీసీల ఆక్రోశ సభని నిర్వహించడం జరుగుతుందనని, దేశంలో అత్యధిక జనాభా కలి గిన బీసీల సమస్య ఈ దేశ ప్రధాన సమస్య అనే నిజం తెలిసి కూడా అగ్ర కుల పాలక వర్గాలు ఆ విషయాన్ని పట్టించుకోకుండా బీసీలను నిరంతరం మభ్యపెడుతూ, మాయచేస్తూ తమ ఓట్ల రాజకీయ


బిసి ఆక్రోశ సభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పబ్బం గడుపుకుంటున్నాయని బిజెపి, కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల దుర్మార్గాలకు చరమగీతం కామా రెడ్డి వేదికగా ఆరంభం కానుందని అన్నారు. ఈ ఆక్రోశ సభకి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సభని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహారాజ్, భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకులు చక్రధర్ గౌడ్, బీసీ నాయకులు శివగౌడ్, బిసి, ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు రవిబాబు, బి రాజు, ప్రసన్న, చందు, డిఎస్‌యూ జిల్లా కన్వీనర్ యాదగిరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**

**మెదక్ టౌన్, నవంబరు 10, ప్రభాతవార్త:** మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కొంటూరు చెరువును సుంద రీకరించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. రాజ్‌పల్లి, మల్కాపూర్‌తండా, కోమ్‌టూర్‌లలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా క్నోటూర్‌లో ఆయన మాట్లాడుతూ రూ.35వేల కోట్లు రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ళు, గృహలక్ష్మి, మహాలక్ష్మి పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడు తున్నాయని చెప్పారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమంలో భాగంగా వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లల పంపిణీ చేపట్టిందన్నారు.మత్స్యకారుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టినటు100 శాతం రాయితీతో చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో మెదక్ మండలం కోంటూర్ పెద్దచెరువులో 1,84,500 చేప పిల్లలు ఎమ్మెల్యే సంబంధిత మత్స్యశాఖ అధికారులు మత్స్య సహకార సంఘ సభ్యులతో కలిసి విడుదల చేశారు. జిల్లాలోని 309 మత్స్య పారిశ్రామిక సహకార సంఘములలో గల (16,820) సభ్యులకు జీవనోపాది కలగటం వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం,జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు ఎం.రామకృష్ణ, అధ్యక్షులు ఎల్ల బోయిన ప్రశాంత్, డైరెక్టర్ జి దేవేందర్, జి అంజయ్య, సంబంధిత ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ట్రాఫిక్ ఎస్ఐ

**సిద్దిపేట అర్బన్, నవంబరు 10, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు విధిగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని సిద్దిపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ.విజయభాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ జనరేషన్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు,రోడ్ సేఫ్టీ,ట్రాఫిక్ సైన్స్, మైనర్లు వాహనాలు నడపడం వలన జరిగే ప్రమాదా లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం మూలంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.మైనర్లు వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమన్నారు. మద్యం సేవించి సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే చట్ట పరంగా చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాని అలాగే సైబర్ నైరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం సేవించి, మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే విధించే చట్టపరమైన శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల యజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.


రైస్ మిల్లును సందర్శించిన డిటిసిఎస్‌లు

'వార్త'కు స్పందన

## కొన్యాల గ్రామాన్ని సందర్శించిన సివిల్ సప్లై అధికారులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబరు 10, ప్రభాతవార్త :**

వార్త దినపత్రికలో ఆదివారం వచ్చిన "నిబంధనల పేరుతో ధాన్యం కొను గోలుకు కొర్రీలు" అనే కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. డీఎస్ఓ ఆఫీస్‌కు చెందిన డిటిసిఎస్‌లు ప్రణీత, విజయలక్ష్మి సోమవారం హత్నూర మండలం కొన్యాల గ్రామంలోని కొనుగోలు సెంటర్‌ను, రైస్ మిల్లును సందర్శించారు. నివేదికను జిల్లా కలెక్టర్కు అందజేస్తామని డిఎస్ఓ తెలిపారు.


సంతకాలు చేసిన అవగాహన ఒప్పంద పత్రాలను చూపుతున్న దృశ్యం

## నవరత్న క్రాప్‌సైన్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం

**ములుగు, నవంబరు 10 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో ఉద్యానరంగంలో విద్యా, పరిశోధన, విస్తరణ కార్యకలాపాలను బలోపేతం చేసేదిశగా ములుగు లోని శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం హైదరాబాద్‌కు చెందిన నవరత్న క్రాప్‌సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకొని సంతకాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉపకులపతి దండ రాజిరెడ్డి మాట్లాడుతూ మూడేళ్ల ఒప్పందం ద్వారా విద్యా నైపుణ్యాన్ని పారిశ్రామిక ఆవిష్కరణతో అనుసంధానించి, విద్యార్థులకు మెరుగైన ఆచర ణాత్మక శిక్షణ,పరిశోధన అవకాశాలను కల్పించడం ద్వారా రాష్ట్రంలో ఉద్యాన సుస్థిరతను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ భాగస్వా మ్యం కింద నవరత్న క్రాప్‌సైన్స్ సంస్థ, పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ లేబరె టరీని పరిశోధనకు అధికారికంగా గుర్తించినట్లు తెలిపారు. దీని ఫలితంగా విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్, డాక్టర్ స్థాయి విద్యార్థులు ఎంచుకున్న పరస్పర అంగీకార అంశాలపై ఎన్‌సిఎస్ అత్యాధునిక ప్రయోగశాలల్లోనే తమ పరిశోధన నిర్వహించేందుకు వీలుకలుగుతుందని తెలిపారు. దీంతో పాటు, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు క్షేత్ర శిక్షణ, పరిశోధనా విద్యార్థులకు ఫెలోషిప్‌లు,అధ్యాపకుల నైపుణ్యాన్ని పంచుకునేందుకు వీలుగా ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలను ఈఒప్పందం సులభతరం చేస్తుందన్నారు. ఇరు సంస్థలు కలిసి మొక్కల వ్యాధుల నివారణకు బయోటెక్నలాజికల్ టూల్స్ అభివృద్ధిచేయడం, పంట రకాల జన్యుపరమైన మెరుగుదల, సుస్థిర వ్యవసాయ పద్ధతుల ఆప్టిమైజేషన్, నూతన ఉద్యాన రకాలను పరిచయం చేయడం వంటి కీలక రంగాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఉత్పన్నమయ్యే మేధోసంపత్తి హక్కులపై ఇరు సంస్థలకు ఉమ్మడి యాజమాన్యం ఉంటుందని తెలిపారు. ఉద్యాన రంగం రాష్ట్ర జీఎస్‌డిపికి సుమారు 5.16 శాతం తోడ్పాటునందిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం తెలంగాణ ఉద్యాన అభివృద్ధికి గణనీయమైన ఊపునిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఏ.భగవాన్, ఎన్‌సిఎస్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ మొహ మ్మద్ అలీ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ డి.లక్ష్మినారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ మరియు డీన్ ఆఫ్ పిజి స్టడీస్ డాక్టర్ సురేష్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్.శ్రీనివాసన్, ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ విజయ, డాక్టర్ పి.సునందిని, డాక్టర్ జి.సతీష్ పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**మర్కుక్, నవంబరు 10 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దామరకుంట గ్రామానికి చెందిన వనం పర్వతాలు, బొల్లబోయిన అజయ్ ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందగా ఎక్కువ మొత్తంలో ఖర్చు కావడంతో ముఖ్య మంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వనం పర్వతాలుకు రూ.15వేలు, బొల్లబోయిన అజయ్‌కి రూ.30వేల చెక్కులు మంజూరుకాగా చెక్కులను సోమవారం వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పత్తి నర్సింలు యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభు, పత్తి శంకర్, సంజీవ, ఆంజనేయులు, ఐలేని, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

## వైన్ షాపును తొలగించాలి

**కొండపాక, నవంబరు 10, ప్రభాతవార్త :** నివాస గృహల మధ్య ఉన్న వైన్‌షాపును తొలగించాలని కాలనివాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వ హించిన ప్రజావాణిలో కలెక్టర్ హైమావతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దుద్దెడ గ్రామస్తులు మాట్లాడుతూ బిసి కాలని, జయశంకర్ కాలని మధ్యలో నివాస గృహల మధ్య ఉన్న వైన్ షాపు వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, మహిళలు అక్కడి నుండి వెళ్లలంటేనే భయపడుతున్నారని తెలిపారు. మద్యం దుకాణం వద్ద మద్యం ప్రియులు బహిరంగంగా మలవిసర్జన, మూత్ర విసర్జన చేస్తుండడంవల్ల రోడ్డుపై నడవ లేని పరిస్థితులు ఉన్నయన్నారు. తాగిన మత్తులో మహిళలను అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా దాడులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు చాలా వేగంగా నడుతున్నారని వారు అవేదన వ్యక్తం చేశారు. కాలనిల మధ్యలో ఉన్న మద్యం దుకాణాన్ని ఇక్కడి నుండి తీసి వేయించి మాకు రక్షణ కల్పించాలని వారు కలెక్టర్‌కు విన్నవించారు.

# 'రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలను చేసిందేమీలేదు'

**గజ్వేల్, నవంబరు 10 (ప్రభాతవార్త):**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి మైనార్టీలకు చేసిందేమీలేదని బిఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ యువజన నాయకుడు జుబేర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లా డారు. రెండు మూడు రోజుల క్రితం జుబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మైనార్టీలను కించపరిచేలా మాట్లాడడం సరైందికాదన్నారు. గత ప్రభుత్వంలో మైనార్టీలకు సముచిత స్థానం కల్పించారని, కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా మైనార్టీలకు చేసింది ఏముందని నిలదీశారు. దేశ స్వాతంత్రం కోసం మైనార్టీలు సైతం పోరాటం చేశారని, మైనార్టీల చరిత్ర తెలుసుకొని మాట్లాడా లని రేవంత్‌రెడ్డికి హితవు పలికారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి చిల్లర మాటలు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో మైనార్టీలను చిన్నచూపు చూస్తున్నారని, భారతదేశంలో అన్ని మతాలను, కులాలను గౌరవించే నాయకులు ఉన్నారని, రాష్ట్రం లో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి అలా మాట్లాడడం మంచిపద్దతి కాదని హెచ్చరిం చారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం పూర్తిగా దివాలా


మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ యువజన నాయకుడు జుబేర్‌పాషా

తీసిందని, చిన్నచితక వ్యాపారులకు సైతం పని లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుండి ఇప్పటివరకు రాష్ట్రం 10 సంవత్సరాల అభి వృద్ధిలో వెనుకబడిందన్నారు. మైనార్టీలను చిన్న చూపుచూస్తే చూస్తూ ఊరుకోమని, రాష్ట్రంలోఉన్న మైనార్టీలు అంతా ఏకమై భరతం పడతామని హెచ్చ రించారు.

మైనార్టీలను కించపరిచేలా మాట్లాడిన రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు విరాసత్‌అలీ, జగదేవ్‌పూర్ మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఇక్బాల్, తంజుముల్ కమిటీ మాజీ అధ్యక్షుడు యూసుఫ్, అహ్మద్, బిఆర్ఎస్‌వి నవాజ్, ఫర్వీజ్, వాజిద్, అలీ, జమాల్, సర్వర్, ఫయాజ్, నయీం పాల్గొన్నారు.


అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పిన్నింటి రత్నం తదితరులు

## అందెశ్రీ మృతి సాహితి లోకానికి తీరనిలోటు

**కవి, గాయకుడు పిన్నింటి రత్నం**

**కొమురవెల్లి, నవంబరు 10, ప్రభాతవార్త :** ప్రజా వాగ్గేయకారులు, లోక కవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత డాక్టర్ అందెశ్రీ మృతి సాహితీలోకానికి తీరని లోటని తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం అన్నారు. సోమవారం కొమురవెల్లిలో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందెశ్రీ పల్లె నీకు వందనాలమ్మ మముగన్నా తల్లి, చూడ చక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి అనేక పాటలు రాసి జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం అనే పాట రాష్ట్ర గీతంగా అందించి తెలంగాణ ప్రజల గుండె ల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కర్త మంకాల సతీష్, బావండ్లపల్లి చంద్రం, చంద్ర శ్రీకాంత్,ముత్యం పర్శ రాములు, ఒరుగంటి బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అందరివాడు అందెశ్రీ

**జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ కేడం లింగమూర్తి**


అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లింగమూర్తి తదితరులు

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 10, ప్రభాతవార్త :** అందెశ్రీ అందరి వాడు అని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. సోమవారం ప్రసిద్ధ కవి అందెశ్రీ మృతికి చింతిస్తూ హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జేఏసీ, జన జాగృతి కళాసమితి సంయుక్త ఆధ్వర్యం లో సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ అందెశ్రీ మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటు అన్నారు. మాజీ కౌన్సిలర్ గాదెపాక రవీందర్ మాట్లాడుతూ మనిషిలో ఘనీభవించిన మానవీయ కోణాన్ని అందెశ్రీ స్పృశించాడన్నారు. ఈ కార్య క్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, జనజాగృతి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్, నాయకులు కొయ్యడ కొమురయ్య, లక్ష్మణ్‌గౌడ్, రవీందర్, మల్లయ్య, ఎండి హసన్, వెంకటరమణ, చంద్రమౌళి, ఎనగందుల లక్ష్మీ నారాయణ, బాలయ్య, భాగ్య, ముత్యాల సంజీవరెడ్డి, మార్క అనిల్ గౌడ్, వాల నవీన్, రవి, ఇజ్జగిరి అనిల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ మృతి తెలంగాణ గొంతుకకు తీరని లోటు


అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**గజ్వేల్, నవంబరు 10 (ప్రభాతవార్త):** అందెశ్రీ మృతి తెలంగాణ గొంతు కకు తీరని లోటని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పొన్నాల కుమార్, దళిత సంఘాల ఐకాస రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, మాల మహానాడు రాష్ట్ర యువజన కార్య దర్శి నీరుడి స్వామి, బండారు దేవేందర్,సందబోయిన ఎల్లయ్య, కానుగుల రమణాకర్, బిసి సంఘం నాయకుడు బాకి స్వామి, డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు పేర్కొన్నారు. అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో కిషోర్, రమేష్, వంశీ, కేదార్‌చారి పాల్గొన్నారు.

**నంగునూరులో...**


అందెశ్రీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**నంగునూర్, నవంబరు 10, ప్రభాతవార్త :** ఉద్యమకారుడు, గేయ రచయిత డాక్టర్ అందెశ్రీ మృతి తెలంగాణకు తీరని లోటని దళిత నాయ కులు ఎనగందుల యాదగిరి, అల్లీబిల్లి నర్సింగరావు, అరెపల్లి రాజయ్య, శ్రీరాముల వెంకటేష్, కొంకటి తిరుపతి, దేవులపల్లి నర్సింగరావు, దేవుల పల్లి రాజమౌళి, గణపురం ఎల్లం, కోడూరు శ్రీనివాస్, దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన డాక్టర్ అందెశ్రీ ప్రశ్నించే గొంతుకలకు స్ఫూర్తి నింపారని పేర్కొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

**కొండపాక, నవంబరు 10, ప్రభాతవార్త :** దేశ భవిష్యత్ యువత చేతి లోనే ఉందని కుకునూరుపల్లి ఎస్సై పండుగ శ్రీనివాస్ అన్నారు. సోమవా రం కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, సూడెంట్ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి అధ్వర్యంలో డ్రగ్స్ రహిత తెలంగాణ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశ భవిష్యత్‌తోపాటు తన భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దే భధ్యత యువత చేతిలనే ఉందన్నారు. మీ భవిస్యత్‌కు మీరే బాధ్యులని, మీ భవిష్యత్‌ను ఎలా కావాలంటే అలా తీర్చిదిద్దుకునే అవకాశం మీ చేతు ల్లోనే ఉందన్నారు. డ్రగ్స్‌తోపాటు చెడు వ్యసనాలు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయలన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే యువత వాహనాలు పడపాలని కోరారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండల న్నారు. జిల్లా ఇంటర్మీడియల్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ చెడు వ్యాసనాలకు దూరంగా ఉండి తల్లిదండ్రులకు మంచి పేరు తెవాలని సూచించారు. విద్యార్థులు శ్రద్దగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాల న్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరిప్రసాద్ నాయుడు, లెక్చరర్స్ శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, రాములు, వెంకన్న, పద్మ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్

## పంచారామాల దర్శనానికి ఆర్టీసి బస్సులు సిద్ధం

**రామచంద్రాపురం, నవంబరు 10, ప్రభాతవార్త:**
బిహెచ్ఈఎల్ ఆర్టీసి డిపో నుంచి కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా పంచారామాల దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసి బస్సులు సిద్ధంగా ఉన్నాయని డిపో మేనేజర్ సుధ పేర్కొన్నారు. సోమవారం బిహెచ్ఈఎల్ డిపో నుంచి ఈ నెల 16న రాత్రి 8గంటలకు డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరి 17న పంచారామాల దర్శనం చేయించుకుని బిహెచ్ఈఎల్ డిపోకు బస్సు తిరిగి వస్తుందన్నారు. పంచారామాల దర్శనానికి వెళ్లే భక్తులు రూ.3383లతో టికెట్ బుక్ చేసుకుంటే పంచారామాల దర్శనంచేసుకోవచ్చన్నారు. పూర్తివివరాలకు 9391072283/9063401072లను సంప్రతించాలని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సుధ వివరించారు.

## శ్రీనివాస్‌నగర్ కాలనీలో బోర్‌వెల్‌కు భూమిపూజ



బోర్‌వెల్ కొరకు పూజలు చేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, నవంబరు 10, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ సండేమార్కెట్ వద్ద ఉన్న కార్పొరేటర్ కార్యాలయంలో గ్రీనరీ కోసం అర్బన్ బయోడైవర్సిటీ ద్వారా నూతనంగా వేస్తున్న బోర్‌వెల్ ఏర్పాటుకు సోమవారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్‌కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ పూజాకార్యక్రమాలు నిర్వహించి బోర్‌వెల్ డ్రిల్లింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సిఎం మల్లేష్, ఆత్మకమిటీ డైరెక్టర్ కవాలి నగేష్, గారెల్ల శ్రీశైలం, ఎల్వర్తి మల్లేశం, స్రామాట్, కాశాల వీరేశం, బైకన్ నవీన్‌యాదవ్, కుమ్మరి రాజు, బికె శ్రీనివాస్, మల్లేష్, ఎర్ర హన్మంతు, సుంకు స్వామి, నరేంద్రబాబు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో గోపిరాజ్‌కు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థి గోపిరాజ్‌ను అభినందిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, నవంబరు 10, ప్రభాతవార్త:**
బిహెచ్ఈఎల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసి మొదటి సంవత్సరంలో విద్యను అందుకుంటున్న వై.గోపిరాజ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 69ఎస్‌జిఎఫ్ రంగారెడ్డి జిల్లాస్థాయి టోర్నమెంట్‌లో 100 మీటర్లను 10.98 సెకండ్లలో, 200 మీటర్లను 22.53 సెకండ్లలో పూర్తిచేసి గోల్డ్‌మెడల్ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు, కోచ్ జివి సుబ్బారావులు తెలిపారు. పోటీలు సరూర్‌నగర్‌లో కొనసాగాయని, 100 మీటర్లలో 200మంది, 200 మీటర్లలో 250మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.

## ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలి

**–శివాలయంలో లక్షబిల్వార్చన నిర్వహించిన ఎమ్మెల్యే జిఎంఆర్**



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, నవంబరు 10, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. కార్తీకమాసం పురస్కరించుకొని సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జెపికాలనీ శ్రీఉమామహేశ్వర దేవాలయంలో ఏర్పాటుచేసిన లక్ష బిల్వార్చన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేకపూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్‌నాయకులు సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## గణితంలో స్వప్న దాచేపల్లికి పిహెచ్‌డి

**పటాన్‌చెరు, నవంబరు 10, ప్రభాతవార్త:**
హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణితశాస్త్రవిభాగం పరిశోధక విద్యార్థిని స్వప్న దాచేపల్లి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. మైక్రో పోలార్, నానోఫ్లూయిడ్ సమస్యలపై వేడి, ద్రవ్యరాశి బదిలీ విశ్లేషణ, గణన పరిష్కారాలు అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణితశాస్త్రవిభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గోవర్ధన్ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. స్వప్న పిహెచ్‌డికి అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలువిభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆత్మకమిటీ చైర్మన్ రామలింగారెడ్డి

**జహీరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంలోని జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (డిసిఎంఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆత్మకమిటీ చైర్మన్ పి.రామలింగారెడ్డ ఎడి బిక్షపతితో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ రామలింగారెడ్డి మాట్లాడుతూ క్వింటాలు మొక్కజొన్నలకు 2400 రూపాయలను అందచేస్తున్నామన్నారు. మార్కెట్‌లో మధ్యదళారులకు మొక్కజొన్న అమ్ముకుని ఆగంకావొద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారిణి లావణ్య, ఎఈఓ ప్రదీప్, వీరేందర్, ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

# బిటి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

**-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**చిలిపిచెడ్, నవంబరు 10, ప్రభాతవార్త:**
సిఆర్ఆర్ నిధులతో నర్సాపూర్ మెదక్ పిడబ్ల్యుడి రోడ్డు నుండి మండలంలోని చిట్కూల్ పిడబ్ల్యుడి రోడ్డు శిలాంపల్లి గ్రామానికి సంబంధించిన పిడబ్ల్యుడి రోడ్డు సిఆర్ఆర్ గ్రాంట్ ద్వారా రూ. 1,40 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు నర్సాపూర్ శాసనసభ్యులు సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. అదేవిధంగా మండలంలోని గంగారం గేటునుండి ఫైజాబాద్ గేట్‌వరకు 8.50 కిలోమీటర్ల బిటి రోడ్డు, శిలాంపల్లి జడ్పి రోడ్డు గౌతాపూర్ బిటి రోడ్డు వయా సోమక్కపేట 4.50 కిలోమీటర్లు, జగ్గంపేట నుండి వయా కొత్తపల్లి చిట్కూల్ ఎక్స్ రోడ్ వరకు 4.50 కిలోమీటర్ల బిటి రోడ్డు సిఆర్ఆర్ గ్రాంట్ ద్వారా రోడ్లు మంజూరు కావడం జరిగింది.

కాగా, ఈ రోడ్ల మరమ్మతులు జనవరి లేదా ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని ఈ రోడ్ల మరమ్మతుల ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తీరతాయని ప్రజల కోసం పనిచేసే తత్త్వం మాదని మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మునుముందు కృషి చేస్తామని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అశోక్‌రెడ్డి, పార్టీ నాయకులు లక్ష్మణ్, సంఘగౌడ్, దుర్గారెడ్డి, నరసింహారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, ఎంసి విట్టల్, గోపాల్‌రెడ్డి, సయ్యద్ హుస్సేన్, షఫీ, గోపాల్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, వీరస్వామి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కందిలో వరి కొనుగోలు కేంద్రం

**-కేంద్రాన్ని ప్రారంభించిన టిజి ఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి

**కంది, నవంబరు 10, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కందిలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలజగ్గారెడ్డి సొసైటీ చైర్మన్, అధికారులు, రైతులతోకలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ దొడ్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి మద్దతుధరను అందుకోవాలన్నారు. మధ్య దళారులకు ధాన్యాన్ని అమ్ముకుని ఆగంకావొద్దని ప్రభాకర్‌రెడ్డి రైతులకు సూచించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మేనేజర్ ఆంజనేయులు, సిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి బ్లాక్ అధ్యక్షులు రఘుగౌడ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేదలకు అండగా బిఆర్ఎస్

**–మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

**నాగల్‌గిద్ద, నవంబరు 10, ప్రభాతవార్త:**
అధికారంలో ఉన్నా, లేకున్నా పేదలకు అండగా ఉండేది బిఆర్ఎస్ పార్టీ మాత్రమే అని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎనక్‌పల్లి పంచాయతీ పరిధిలోని ఫత్తునాయక్ తండాకు చెందిన వడిత్యా అభిషేక్ అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకుని వైద్యఖర్చుల నిమిత్తం 70వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ నిధుల చెక్కును కుటుంబసభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చేన్ బసప్పా, లక్ష్మన్‌నాయక్, బిఆర్ఎస్ నాయకులు రవిందర్‌నాయక్, అడివప్ప, చింటూ, నరేష్, శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## 7 క్వింటాళ్ల పత్తి కొనుగోలు పరిమితిని ఎత్తేయాలి

**–రైతు సంఘం రాష్ట్ర నాయకులు జయరాజు**



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు జయరాజు

**సంగారెడ్డి టౌన్, నవంబరు 10, ప్రభాతవార్త:**
పత్తి పంటను ఎకరాలకు 7 క్వింటాళ్ల మాత్రమే తీసుకుంటామని విధించిన పరిమితిని ఎత్తేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని కెకె భవన్‌లో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో జయరాజు మాట్లాడుతూ కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్‌తో రైతులకు తిప్పలు తప్పడంలేదన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తిలో తేమశాతం 8నుంచి 12వరకు పెరిగిందని, తేమశాతం పెరగడంతో సిసిఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఎలాంటి పరిమితులు, నిబంధనలు విధించకుండా రైతులనుంచి పత్తిని కొనుగోలుచేయాలని డిమాండ్‌చేశారు. కేంద్రప్రభుత్వంపై సిఎం రేవంత్‌రెడ్డి వత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాజయ్య, ఉపాధ్యక్షులు యన్.శ్రీనివాస్, నర్సింహారెడ్డి, యాదవరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంది ఐఐటి వద్ద కార్మికుల ధర్నా



కంది ఐఐటి వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**కంది, నవంబరు 10, ప్రభాతవార్త:**
కంది ఐఐటి గేటువద్ద కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్‌చేస్తూ సోమవారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లానాయకులు ఎం.ఎ.ఖాజా మాట్లాడుతూ ఐఐటిహెచ్ కార్మికుల వేతనాలను మూడో తారీఖు చెల్లించాల్సి ఉండగా, కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ మూడుమాసాలుగా కార్మికులకు 10వ తారీఖు వరకు వేతనాలు అందించపోవడం తగునా అని ప్రశ్నించారు. కార్మికులందరికీ ఒకే రకమైన యూనిఫామ్‌లు సైతం అందించడంలేదన్నారు. పిఎఫ్‌కు దరఖాస్తులు చేసుకున్నోళ్లందరికీ రావడంలేదని విచారం వ్యక్తంచేశారు. బిఎఫ్ అందరికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని, వేధింపులు ఆపాలని క్యాంటీన్ యూనివర్సిటీ కల్పించాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి ఐఐటిహెచ్ ద్వారానే కార్మికుల నియామకాలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులందరికీ పెర్మనెంట్ చేయాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎం.ఎ.ఖాజా డిమాండ్‌చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## అక్రమ నిర్మాణాలపై ప్రజల ఫిర్యాదు



తెల్లాపూర్‌లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

**రామచంద్రాపురం, నవంబరు 10, ప్రభాతవార్త:**
తెల్లాపూర్‌లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, శాంతిభద్రతల సమస్యలపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. మేఫెయిర్ విల్లాస్, ఇన్ఫినిటీ విల్లాస్, హనీడ్యూ అపార్ట్‌మెంట్, మేఫెయిర్ అపార్ట్‌మెంట్ నివాసితులు కొల్లూరు పోలీసు ఠాణాలో, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా ప్రజలు మాట్లాడుతూ అనధికారనిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలతో విశాలప్రాంతాలు కుదించుకుపోతున్నాయని, శాంతిభద్రతల సమస్యలపై చర్యలు తీసుకోవాలని వినతి చేశారు. క్యారేజ్ వేను ఇరుకుగా చేస్తున్నాయన్నారు. ట్రాఫిక్ ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. వీధివ్యాపారులు, కార్మికుల సమావేశాలతో ప్రజలు పరేషాన్ అవుతున్నారన్నారు. అక్రమ నిర్మాణాలను తక్షణమే అడ్డుకోవాలని డిమాండ్‌చేశారు. తామెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వినతిచేశారు. కార్యక్రమంలో ప్రదీప్‌రెడ్డి, సతీష్, ప్రసాద్‌రాజు, మన్మోహన్, నీరాజ్‌సింగ్, రాజు, నాగేశ్వర్‌రావు, వీరనారాయణ, తెల్లాపూర్ పరిసరాల సంఘం అధ్యక్షులు రమణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంప్

**కంగ్టి, నవంబరు 10, ప్రభాతవార్త:**
మండల కేంద్రం అయిన కంగ్టిలో బుధవారం రాధా క్లినిక్ వారి ఆధ్వర్యంలో స్టార్ హాస్పిటల్ తరపున ఉచిత హెల్త్‌క్యాంప్‌ను ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు డాక్టర్ పి.మోహన్ కుమార్ ఆర్థో ఎంబిబిఎస్ ఎంఎస్ ట్రామా, రోబోటిక్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్, అలాగే డాక్టర్ నెహ్రూరాథోడ్ బిహెచ్ఎంఎస్, ఎండి ఈఎంఎస్ వారి తరపున ఉచిత ట్రీట్మెంట్‌ను నిర్వహిస్తున్నారు. మండల ప్రజలు ఈ ఉచితసేవను వినియోగించుకోవాలని కోరారు. ఆర్థోపెడిక్ హెల్త్‌క్యాంప్‌లో కీళ్లనొప్పులు, మెడనొప్పి, నరాలనొప్పులు, మోకాళ్ళనొప్పులు, నరాలసమస్యలు, ఈసిజిలు, న్యూరో, మోకాలిమార్పిడి వంటి వ్యాధులకు చికిత్స ఉచితంగా నిర్వహిస్తామని రాధా క్లినిక్ డాక్టర్ నెహ్రూ తెలిపారు.

# రుచికోసం కాదు ఆరోగ్యంకోసం ఆహారం తీసుకోవాలి

**-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**



శ్రీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, డిడబ్ల్యుఓ హేమభార్గవి

**చిలిపిచెడ్, నవంబరు 10, ప్రభాతవార్త:**
రుచి కోసం కాకుండా మన ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆహారం తీసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలోని చిలిపిచెడ్ మండల కేంద్రమైన హైస్కూల్ ప్రాంగణంలో పోషణమాసఉత్సవం, బాల్యవివాహనిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి వ్యక్తి రుచికోసం కాదు.. ఆరోగ్యంకోసం అన్ని రకాల ఆహారపదార్థాలు తినాలని, ముఖ్యంగా స్థానికంగా దొరికే ఆకుకూరలని తిని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఆడపిల్లను చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా చూడాలని, చదువులు చదివించి వారికి ఉద్యోగాలు వచ్చిన తర్వాత పెళ్లిళ్లు చేస్తే రాబోయేకాలంలో మంచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారుచేసుకోవచ్చు అన్నారు. ఈసందర్భంగా ఇక్కడ ఏర్పాటుచేసిన న్యూట్రిషన్ స్టాల్స్ అన్నింటిని చూసి అభినందించారు. అనంతరం పోషణ అభియాన్ కార్యక్రమంలో ఉత్తమ, అంగన్‌వాడీ టీచర్లకు ఆశా, ఎపిఎం, సిఎ, సిసి పంచాయతీ కార్యదర్శికి, ఎఎన్ఎం మెడికల్ ఆఫీసర్, హెల్త్ సూపర్వైజర్, పారిశుధ్య కార్మికులకు, ప్రశంసపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా డిడబ్ల్యుఓ హేమభార్గవి మాట్లాడుతూ బాల్యవివాహాలులేని జిల్లాగా తీర్చిదిద్దాలని దీని కోసం ప్రతి ఒక్కరి సహాయం, సహకారం కచ్చితంగా ఉండాలని ఆమె కోరారు. అనంతరం గర్భిణిలకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి చిలిపిచెడ్ మండల ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, ఎమ్మార్వో, ఎంపిడివో, ఎపిఎం, వైద్యాధికారి, ఎస్ఐ, పంచాయతీ కార్యదర్శులు, సిఎలు, సిసిలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, షీ-టీమ్, సఖి-టీమ్, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇంచార్జి ఏఈఓగా రాంప్రసాద్‌కు అదనపు బాధ్యతలు

**రేగోడ్, నవంబరు 10, ప్రభాతవార్త:**
మండల వ్యవసాయ అధికారి జావీద్ ఉన్నతచదువులను అందుకునేందుకు సెలవులపై వెళుతున్నందున టేక్మాల్ మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్‌కు జిల్లా ఉన్నతాధికారులు అదనపుబాధ్యతలు అప్పగించారు. రాంప్రసాద్ సోమవారం రేగోడ్‌లోని వ్యవసాయ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.

## శెల్గిర జడ్పిహెచ్ఎస్‌లో షీ టీంపై అవగాహన




జడ్పిహెచ్ఎస్‌లో షీ టీంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మనూర్, నవంబరు 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని శెల్గిర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు షీ టీంపై. పలు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులక ఎఎస్ఐ తులసీరాం, చంగుబాయిలు పలు విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకోవాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాఘవేందర్ నాయక్, ఉపాధ్యాయులు కాశీం, రాజేశ్వర్, దేవిసింగ్, శివకుమార్, అనిత, స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూంరెడ్డి చిత్రపటానికి స్పీకర్ నివాళులు



నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**చౌటకూరు, నవంబరు 10, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరు మాజీ సర్పంచ్ దివంగత భూంరెడ్డి బాల్‌రెడ్డి చిత్రపటానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి అక్టోబరు 30న మరణించడంతో సోమవారం స్వగృహంలో దశదినకర్మ కార్యక్రమాల్లో స్పీకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శశాంక్‌రెడ్డి, ఎంపిపి మాజీ అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, పుల్‌కల్ మండలకాంగ్రెస్ అధ్యక్షులు దుర్గారెడ్డి, డిసిసిబి మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డి, నాయకులు సరాఫ్‌పల్లి రామచంద్రారెడ్డి, గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, అందోల్ కృష్ణ, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, రాములు, మొగులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించండి

**–తహసీల్దార్‌కు లింగాయత్ సమాజ్ బాధ్యుల వినతి**



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న లింగాయత్‌సమాజ్ సభ్యులు

**జహీరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంలో వీరశైవ లింగాయత్ జనాభా అధికంగా ఉన్నందున లింగాయత్‌లకు శ్మశాన వాటికకు 5ఎకరాల స్థలాన్ని కేటాయించాలని వినతిచేస్తూ సోమవారం తహసీల్దార్‌కు వీరశైవ లింగాయత్ సమాజ్‌బాధ్యులు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ అధ్యక్షులు రాజశేఖర్‌శెట్కార్, ప్రధానకార్యదర్శి రేకుల్గి సుభాష్, సభ్యులు బసవరాజ్ మడపతి, కుమార్ వైద్యనాథ్, మల్లికార్జున్ తంబోలే, చంద్రశేఖర్ ఉల్లిగడ్డల, మనోహర్, ప్రకాస్, బసవరాజ్ మల్చమా, సురేష్‌శెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన పోలీసు అధికారులు



మొక్కలు నాటుతున్న సిఐ శివలింగం

**జహీరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:**
వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని డిఎస్‌పి సైదానాయక్ ఆధ్వర్యంలో జహీరాబాద్ సిఐ శివలింగం, పట్టణ ఎస్ఐ కె.వినయ్‌కుమార్‌లు తమ సిబ్బందితో కలిసి సోమవారం పోలీసుఠాణా ఆవరణలో 30మొక్కలు నాటారు. భవిష్యత్తు తరాలకు చెట్టుగా పెరిగిన మొక్కలు వాతావరణ సమతుల్యాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సంగమేశ్వర్, జగదీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడాకులపల్లి పాఠశాలలో మినీ ప్రాజెక్టు

**–విద్యార్థులకు టై, బెల్టులు, నోట్‌పుస్తకాల పంపిణీ**

**ఝరాసంగం, నవంబరు 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన ప్రవీణ్‌పాటిల్, గణేష్‌యూత్ వారు విద్యార్థులకు టై, బెల్టులు, నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ప్రవీణ్‌కుమార్ తన కుమార్తె పుట్టినరోజును పురస్కరించుకుని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీచేసి పాఠశాలకు మినీ ప్రాజెక్టును బహూకరించారు. గణేష్‌యూత్ వారు టై, బెల్టులు అందచేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, చైర్మన్ కల్పన, ఉపాధ్యాయులు రజిత, ప్రియాంక, రేణుక, గ్రామస్థులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, ప్రవీణ్, క్రాంతి, సిఆర్‌పిలు, సిబ్బంది రాజు, షఫీ, చిరంజీవి, శివ తదితరులు పాల్గొన్నారు.